సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ; 2 ; డిసెంబర్ ; 2024



ఉత్సాహంగా ఉర్సు..

ఇల్లెందు నాగుల్‌మీరా దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తుల సందడి నెలకొంది. 8లో



సొంత అవసరాలకు..

సింగరేణి మణుగూరు ఆస్పత్రి అంబులెన్స్‌లను సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గోదావరి జలాలతో శివలింగానికి అభిషేకం



గోదావరి జలాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచ శ్రీ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం 1008 కలశాలతో గోదావరి పవిత్ర జలాలతో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాలకు జాతీయ అయ్యప్ప సేవా సమితి బాధ్యుడు రాజ్ దేశ్ పాండే, గొల్లగూడెం సాయి సత్సంగం సేవకులు గాజర్ల వీరభద్రం దంపతులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన పూజారి జితేంద్ర శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భజన నిర్వహించారు. సుమారు 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప స్వామి, సాయిబాబా, భవాని, శివ మాలధారులు, ఆలయ కమిటీ సభ్యులు యల్లావుల కోటయ్య, వెంకన్న, రమణ, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మహన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలు చేశారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

టేకులపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం టేకులపల్లి మండలంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆరు బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కాగా మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రెగ్లపాడు గ్రామపంచాయతీలో ఉన్న హైలెవెల్ బ్రిడ్జిని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర డిజాస్టర్ టీం సోమవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండని కారణంగా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేయడానికి రావొద్దని సూచించారు.

సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి రాతపరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న జీఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్నల్ అభ్యర్థులకు ఆదివారం సింగరేణి మహిళా కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. 12 ఖాళీలు ఉండగా, 469 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్ష నిర్వహించారు. జీఎంలు కె.శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు పర్యవేక్షించారు. అధికారులు పి.వేణు గోపాలరావు, కె.ప్రకాశరావు, షకీర్ మొహిసుద్దీన్, డి.నాగేశ్వరరావు, ఎండీ జాకీర్‌హుస్సేన్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శారద తదితరులు పరిశీలించారు.

రామగుండం తరహాలో..

పరిశ్రమలు స్థాపించని స్థలాలు వెనక్కుతీసుకుంటే మేలు



ఎన్‌ఎండీసీ-సిల్ యూనిట్ మూతపడటంతో నిరుపయోగంగా ఉన్న స్థలం

వరంగల్ నగరం తర్వాత కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ పట్టణాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వరంగల్, ఆదిలాబాద్‌లు పాత జిల్లా కేంద్రాలు కావడంతోపాటు నైజాం జమానాలోనే అక్కడ ఎయిర్‌పోర్టు, డిఫెన్స్‌కు సంబంధించిన స్థలాలు ఉన్నాయి. కొంతమేరకు భూమిని సేకరిస్తే ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకు ప్రధాన అడ్డంకులు తొలగిపోతాయి. కానీ రామగుండం, కొత్తగూడెం వంటి పారిశ్రామిక ప్రాంతాల పరిస్థితి వీటికి భిన్నంగా ఉంది. ఈ రెండు పట్టణాల చుట్టూ అడవులు, కొండలు ఎక్కువగా విస్తరించి ఉన్నాయి. థర్మల్ పవర్ స్టేషన్లకు సంబంధించిన చిమ్నీల కారణంగా నిర్మాణపరంగానూ అడ్డంకులు ఉన్నాయి. దీంతో ఇక్కడ స్థల సేకరణ కష్టంగా మారుతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- జిల్లాలో వెయ్యి ఎకరాలకు మించి అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఇప్పటికే వందల ఎకరాలను ప్రభుత్వానికి తిరిగిచ్చిన సింగరేణి
- నిరుపయోగంగా ఉంటున్న స్టీల్ ప్లాంట్, ఎన్‌ఎండీసీ స్థలాలు
- అన్యాక్రాంతం కాకముందే అధికారులు స్పందిస్తే ల్యాండ్‌బ్యాంక్ ఏర్పాటు

స్థల సేకరణ చిక్కులు

కొత్తగూడెంలో పునుకుడుచెలక, బంగారుజాల-గుడిపాడుల దగ్గర ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో పట్టణ శివారులో ఉన్న గరీబ్‌పేట దగ్గర చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల పరిధిలోని స్థలాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. రామగుండంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందుగా ఓ సిమెంటు పరిశ్రమకు చెందిన పాత ఎయిర్‌స్ట్రిప్ స్థలాన్ని పరిశీలించారు. సాంకేతిక ఇబ్బందులతో ఆ పనులు ఆగిపోయాయి. ఫలితంగా ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ క్లిష్టంగా మారింది. ఏళ్ల తరబడి విమానయానం కలలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అయితే ఇటీవల విమానాశ్రయం నిర్మాణానికి సరికొత్త ఫార్ములాను ఆ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదించారు. దీంతో రామగుండం ఎయిర్‌పోర్టు నిర్మాణ అంశం మళ్లీ వెలుగులోకి వచ్చింది.

రామగుండం మోడల్

రామగుండం పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు గతంలో భారీగా భూములు కేటాయించారు. ఈ క్రమంలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఓ మల్టీనేషనల్ కంపెనీకి 1,800 ఎకరాల స్థలాన్ని 1994లో కేటాయించారు. పదేళ్లు గడిచినా ఆ సంస్థ పరిశ్రమ స్థాపించకపోవడంతో 2004లో సదరు స్థలం వెనక్కి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది. దీంతో లీగల్ చిక్కులు వచ్చాయి. ఇటీవల ఈ అంశం సామరస్యంగా కొలిక్కి వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అక్కడే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గతంలో పరిశ్రమల కోసం కేటాయించిన స్థలం వెనక్కి తీసుకోవడం వల్ల కనీసం వెయ్యి ఎకరాల స్థలం ఇప్పుడు అక్కడ ప్రభుత్వానికి ల్యాండ్‌బ్యాంక్‌గా అందుబాటులోకి రాబోతోంది.

మన దగ్గర..

గతంలో బొగ్గు కోసం ప్రభుత్వ స్థలాలను సింగరేణి లీజుకు తీసుకుంది. కొన్ని ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తి అయిపోవడం, మరికొన్ని చోట్ల బొగ్గు ఉత్పత్తి చేయలేని పరిస్థితులు ఉండటంతో గతంలో లీజుకు తీసుకున్న స్థలాలు సింగరేణికి మిగులుగా మారాయి. సంస్థ ఇలాంటి వాటిని క్రమంగా ప్రభుత్వానికి అప్పగిస్తోంది. కొత్తగూడెం ఏరియా పరిధిలోనే 175 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఇలా తీసుకున్న స్థలం ఎక్కడుంది? ఎంతుందనే కచ్చితమైన సమాచారం ప్రభుత్వం దగ్గర లేదు. దీంతో సింగరేణి నుంచి ప్రభుత్వానికి వచ్చిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఇక పాల్వంచలో ఐదు వందల ఎకరాలకు పైగా స్థలంలో ఏపీ స్టీల్స్, ఎన్‌ఎండీసీ-స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు గతంలో ఏర్పాటయ్యాయి. అవి రెండు మూతపడటంతో ఆ స్థలం పదేళ్లుగా నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. కేటీపీఎస్‌లో ఓఅండ్‌ఎం యూనిట్లు మూత పడటంతో అక్కడ నాలుగు వందల ఎకరాల స్థలం కొత్తగా అందుబాటులోకి వచ్చింది.

ల్యాండ్‌బ్యాంక్ ఉంటే..

ప్రభుత్వం దగ్గర ల్యాండ్‌బ్యాంక్ అందుబాటులో ఉంటే పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుంటుంది. భవిష్యత్తులో రాబోయే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల స్థాపనకు, సంక్షేమ పథకాల అమలుకు ఇబ్బందులు రావు. అడవులు ఎక్కువగా ఉన్న జిల్లా కావడం వల్ల ఎక్కడైనా ఫారెస్టు స్థలం తీసుకుంటే ప్రతిగా ప్రభుత్వ స్థలం ఇచ్చేందుకు అక్కరకు వస్తుంది. రామగుండం మోడల్ తరహాలో జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలతో ల్యాండ్‌బ్యాంక్ ఏర్పాటుపై నజర్ పెట్టాల్సిన అవసరం ఉంది.



సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ పరిశ్రమ

బయట చలి.. ఐటీసీలో వేడి!

- పీఎస్‌పీడీలో 'గుర్తింపు' ఎన్నికలకు సమాయత్తం
- ఇప్పటికే ప్రచారం ప్రారంభించిన కార్మిక సంఘాలు
- 10న డీసీఎల్ సమక్షంలో సమావేశం
- పరిశ్రమలో 1,250 మంది కార్మికులకు ఓటు హక్కు

బూర్గంపాడు: ఆసియా ఖండంలోనే అతిపెద్ద పేపర్ పరిశ్రమగా వెలుగొందుతున్న సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వేడి రాజుకుంది. గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ముగియటంతో ఎన్నికల నిర్వహణకు కార్మికశాఖ సమాయత్తమవుతోంది. గత ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా విజయం సాధించింది. పదవీకాలం రెండేళ్లుకాగా, 2023 సెప్టెంబర్‌తో కాలపరిమితి ముగిసింది. వేతన ఒప్పందంలో ఆలస్యం తదితర కారణాలతో ఎన్నికల నిర్వహణలో ఏడాదికి మించి జాప్యం జరిగింది. 14వ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు నిర్వహించాలని పలుమార్లు కార్మిక సంఘాలు విన్నవించగా, కార్మికశాఖ చర్యలు చేపట్టింది. ఈ నెల 10న ఐటీసీ పీఎస్‌పీడీలోని అన్ని కార్మిక సంఘాల నాయకులతో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆధ్వర్యంలో ఖమ్మంలో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు. ఆ సమావేశంలో ఎన్నికల నిర్వహణ, తేదీలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

గెలిచేందుకు ట్రేడ్ యూనియన్ల పోటాపోటీ

ఎన్నికల్లో గెలిచేందుకు ట్రేడ్ యూనియన్‌లు పోటీ పడుతున్నాయి. పరిశ్రమలో మొత్తం కార్మిక యూనియన్‌లు ఉన్నాయి. ఇందులో కొన్ని యూనియన్‌లు కలిసి కూటమిగా బరిలోకి దిగుతున్నాయి. టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలు, ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాలు, బీఆర్‌టీయూ మిత్ర పక్షాల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని ప్రచారం సాగుతోంది. ఈసారి బీజేపీ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ కూడా బరిలో నిలుస్తుంది. టీఎన్‌టీయూసీకి తెలుగుదేశం, ఐఎన్‌టీయూసీకి కాంగ్రెస్, బీఆర్‌టీయూకి బీఆర్‌ఎస్, బీఎంఎస్‌కు బీజేపీ, ఏఐటీయూసీకి సీపీఐ, సీఐటీయూకి సీపీఎంలు అండదండగా నిలుస్తున్నాయి. ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు ట్రేడ్ యూనియన్లకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తమ పార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్లకు మద్దతుగా ప్రచారం చేస్తారు. కేవలం 1,250 ఓట్లు ఉన్న ఈ ఎన్నికల్లో గెలిచేందుకు ట్రేడ్ యూనియన్లు రూ. లక్షలు ఖర్చు చేస్తున్నాయి. ఎన్నికల తేదీ ప్రకటించక ముందే ప్రచారం పర్వం ఊపందుకుంది. ప్రాంతాల వారీగా, డిపార్ట్‌మెంట్‌ల వారీగా, కులాల వారీగా విందు రాజకీయాలకు తెరతీశారు. ఇప్పటి నుంచే డబ్బు, మద్యం పంపిణీ షురువైంది. ఇక గొడవలు జరగకుండా పోలీస్‌శాఖ కూడా నిఘా పెట్టింది. డిసెంబర్/జనవరిలో ఎన్నికలుంటాయని ట్రేడ్ యూనియన్ నాయకులు చెబుతుండగా, పరిశ్రమలో సుమారు 50 రోజులపాటు సందడి నెలకొననుంది.

వేతన ఒప్పందాలు, కార్మిక సమస్యల పరిష్కారంలో కీలకం

వేతన ఒప్పందాలు, కార్మిక సంక్షేమం, అభివృద్ధి కోసం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహిస్తారు. గెలిచిన కార్మిక సంఘాన్ని రికగ్నైజ్డ్ యూనియన్‌గా గుర్తించి వేతన ఒప్పంద ప్రక్రియలో యాజమాన్యంతో చర్చలు జరిపేందుకు అవకాశం కల్పిస్తారు. పరిశ్రమలో కార్మిక సమస్యల పరిష్కారానికి కూడా గుర్తింపు కార్మిక సంఘమే కీలకంగా పనిచేస్తుంది. ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సాధారణ ఎన్నికలను మించిన పోరు ఉంటుంది. గెలిచేందుకు కార్మిక సంఘాలు కూడా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తాయి. కర్మాగారంలోని పర్మనెంట్ కార్మికులు, బదిలీ కార్మికులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు ఉండదు. పరిశ్రమలో పనిచేసే జూనియర్, సీనియర్ మేనేజర్లకు, ఇతర ఉన్నతాధికారులకు కూడా ఓటు హక్కు ఉండదు. ఈసారి జరిగే ఎన్నికల్లో పర్మనెంట్ కార్మికులు, బదిలీ కార్మికులు కలిసి మొత్తం 1,250మందికి ఓటు హక్కు ఉంది.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఉత్సవాల్లో ఆలయ ఈఓ రమాదేవి
- గోపూజతో ప్రారంభమైన ప్రజాపాలన విజయోత్సవాలు



గోశాలలో పూజ చేస్తున్న ఈఓ రమాదేవి, అర్చకులు

భద్రాచలం: తెలంగాణ ప్రజలు ప్రజాప్రభుత్వ పాలనలో సుభిక్షంగా ఉండాలని ఆలయ ఈఓ రమాదేవి, పండితులు ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలు ఆదివారం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోపూజతో ఉత్సవాలను ఆరంభించారు. అనంతరం పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణం జరిపారు. బేడా మండపంలో సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం చిత్రకూట మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కాగా ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు ఈ నెల 9 వరకు జరుగుతాయని ఈఓ వెల్లడించారు. రోజూ వేద పారాయణం, సహస్ర నామార్చనలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు, భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. స్థానాచార్యులు కేఈ స్థలశాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాలన ప్రజారంజకంగా సాగాలని ప్రత్యేక పూజలు జరిపినట్లు వివరించారు.

రామయ్య మూలమూర్తులకు అభిషేకం

దేవస్థానం అంతరాలయంలో ఆదివారం మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో సైతం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాపాలన సంబురాలు షురూ..

- విద్యుత్ కాంతులతో కార్యాలయాల అలంకరణ
- ఈ నెల 9 వరకు సంక్షేమ పథకాలపై కార్యక్రమాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్

చుంచుపల్లి: జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు మొదలయ్యాయి. తొమ్మిది రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంగా విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేలా కలెక్టర్ ప్రణాళికలు రూపొందించారు. మొదటి రోజు ఆదివారం 2కే రన్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సీఎం కప్ క్రీడల ప్రారంభంతోపాటు పాఠశాలస్థాయి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 7వ తేదీతో ఏడాది పూర్తి కానున్న నేపథ్యంలో ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు విజయోత్సవ సంబరాలు జరుపుతున్నారు. రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు సరఫరా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జిల్లా వాసులకు కలిగిన లబ్ధిపై ఈ సందర్భంగా వివరించనున్నారు. సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో నూతన అంబులెన్స్‌లతో పాటు ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్‌లను అందుబాటులోకి తెస్తారు. 3న జిల్లాలోని మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంపుల నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన సేఫ్టీ కిట్లు పంపిణీ, అమృత్ పనులకు శంకుస్థాపన వంటివి చేపడతారు. 4న హైదరాబాద్‌లో తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బొటానికల్ పార్కుల వర్చువల్ ప్రారంభోత్సవం, సఫారీ థీమ్ పార్క్ వృక్ష పరిచయ క్షేత్రం ప్రారంభిస్తారు. అదేరోజు సాయంత్రం పెద్దపల్లిలో బహిరంగ సభ నిర్వహించి జిల్లాకు చెందిన 181 మంది అభ్యర్థులకు జిల్లా తరపున నియామక పత్రాలను అందజేస్తారు. 5న మహిళా శక్తి కార్యక్రమాలు, 6న ఉచిత విద్యుత్‌పై క్షేత్రస్థాయిలో వివరిస్తారు. 7న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ పరికరాలను విద్యార్థులకు ప్రదర్శించి వినియోగ ప్రాముఖ్యతను తెలుపుతారు. 8న జిల్లాలోని పరిశ్రమల ద్వారా సాధించిన విజయాలు, క్రీడారంగ అభివృద్ధిపై చర్చిస్తారు. చివరి రోజు ప్రజాపాలనలో సాధించిన విజయాలు, జిల్లాలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో పాటు ఇతర ముగింపు అంశాలు ఉంటాయి.

పర్యాటకులు పరవశించేలా..

- కిన్నెరసాని ప్రాంతాన్ని తీర్చిదిద్దాలి
- ఇక్కడి కెనాల్‌ను చూస్తే విదేశాలు గుర్తుకురావాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచరూరల్: ప్రకృతి అందాలకు నిలయమైన కిన్నెరసానికి వచ్చే పర్యాటకులు పరవశించేలా, ఇతర దేశాలు గుర్తుకువచ్చేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తక్కువ ఖర్చుతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మండల పరిధిలోని కిన్నెరసానిని ఆదివారం ఆయన సందర్శించారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రెండుగంటల పాటు గడిపారు. అభివృద్ధి పనులు నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిన్నెరసానిలోని కేటీపీఎస్ కెనాల్‌పై తక్కువ ఖర్చుతో జపాన్, కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా వెదురు బొంగులతో కూడిన రెండు బ్రిడ్జిలు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. జలాశయం మధ్యలోని ఆనంద ద్వీపంలో వెదురు బొంగులతో ప్రత్యేక కాటేజీ నిర్మించాలని, కాల్వపై బ్రిడ్జిలతోపాటు పూల గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. చిల్డ్రన్ పార్క్ ఏర్పాటుచేయాలని, మహిళా శక్తి ద్వారా పర్యాటకులకు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పర్యాటకులు భోజనం చేసేలా, కోతుల బెడదలేకుండా ప్రశాంతంగా కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని వివరించారు. కెనాల్‌లో పుట్టి (నాటు పడవ) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులపై వారం రోజుల్లో అంచనాలను రూపొందించి నివేదిక అందించాలని ఆర్‌అండ్‌బీ ఏఈ శివగణేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, కేటీపీఎస్ డీఈ రామకృష్ణ, ఏఈ సురేష్, ఆర్‌ఐ హచ్యా, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌ఎస్‌ఓ కిషన్, ఎఫ్‌బీఓ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించుకోవాలి



నాగినేనిప్రోలులో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

బూర్గంపాడు: రైతులు పాడి పంటలతో సంపద సృష్టించుకోవాలని, అందుకోసం ప్రభుత్వపరంగా చేయూతనందిస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కింద చేపట్టిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో పాడి పరిశ్రమకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందన్నారు. రైతులు పంటల సాగుతోపాటు అనుబంధ రంగాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా పశువులు, జీవాలు, కోళ్లు, కౌజు పిట్టల పెంపకంపై ఆసక్తి చూపాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్లు వేసుకునేందుకు, మేతను పెంచుకునేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లకు 50శాతం మేర రాయితీ వస్తుందన్నారు. శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలు, పాల ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని పశు వైద్యాధికారులను ఆదేశించారు. శిబిరంలో అధిక పాలనిచ్చే పశువులను గుర్తించి ఆ రైతులకు బహుమతులను అందజేశారు. దూడల ప్రదర్శన నిర్వహించి ఆరోగ్యకరమైన మూడు దూడలను ఎంపిక చేసి వాటి యజమానులు సింగం సంజీవరెడ్డి, యారం వెంకటరెడ్డి, బిజ్జం సత్యమారెడ్డిలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ శ్రీనివాస రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి పురంధర్, జిల్లా పశు గణాభివృద్ధి అధికారి కిషోర్, పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు సత్యప్రసాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, మండల పశువైద్యాధికారి బాలకృష్ణ, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

31 వరకు సీఎం ఓవర్సీస్ గడువు

కొత్తగూడెంఅర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 5 లక్షలలోపు కలిగి, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, సౌత్ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ దేశాల్లో పీజీ, పీహెచ్‌డీలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు స్కాలర్ షిప్ పొందవచ్చని పేర్కొన్నారు. ఉపకార వేతనం రూ.20 లక్షలతోపాటు విమాన చార్జీల నిమిత్తం రూ.60 వేలు అందిస్తారని వివరించారు.

ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలిద్దాం

న్యాయమూర్తి భానుమతి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేద్దామని జిల్లా న్యాయమూర్తి భానుమతి అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ముర్రేడు వాగు బ్రిడ్జి నుంచి రైల్వే స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జడ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం మన చేతుల్లోనే ఉందన్నారు. డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ సురక్షితమైన లైంగిక జాగ్రత్తలు తీసుకుంటే ఎయిడ్స్ బారిన పడకుండా ఉంటామన్నారు. ఎయిడ్స్ బాధితుల్లో ధైర్యం నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎయిడ్స్‌కు సరైన మందులు లేవని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఫైజ్ మొహియుద్దీన్, తేజస్విని పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉర్సు ఉత్సవాలు!


అశ్వరథంపై నాగుల్‌మీరా నిషానీలు, అశ్వాలపై నవ జవాన్లు

కొనసాగుతున్న నాగుల్ మీరా జులూస్

- ఆకట్టుకున్న సింగిరి, తంబోలా వాయిద్యకారులు
- ప్రత్యేక ఆకర్షణగా కవ్వాలి కళాకారులు
- కులమతాలకు అతీతంగా పాల్గొన్న భక్తులు
- అడుగడుగునా అశేష భక్తజన నీరాజనం

ఇల్లెందురూరల్/ఇల్లెందు: సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్న హజరత్ నాగుల్‌మీరా దర్గాహ్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన ఆదివారం భక్తుల కోలాహలం నడుమ పట్టణంలోని హజరత్ ఖాసీం దుల్హాహ్ దర్గా షరీఫ్ నుంచి సుమారు ఏడు గంటల పాటు సత్యనారాయణపురం గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ చిల్లా వరకు జులూస్ కొనసాగింది.

నవ జవాన్ల మార్గనిర్దేశంలో..

ఎంతో ఆకర్షణీయంగా అలంకరించిన కస్నీల్ ముందు నడుస్తుండగా వెనుక ముగ్గురు నవ జవాన్లు కత్తులు పట్టుకుని గుర్రాలపై, మరో ఇద్దరు నవజవాన్లు నెమలి పింఛం చేతపట్టుకొని దారిచూపుతున్నట్లుగా ఒంటెలపై ముందుకు సాగగా.. నవజవాన్ల మార్గనిర్దేశంలో నాగుల్ మీరా నిషానీలు, భక్తులు ముందుకు కదిలారు. ఈ జులూస్‌లో ముందు నాగుల్ మీ రా, ఆ తర్వాత నీల్ హైదర్ బగ్గీలు వెళ్తుండగా.. బంగారు వర్ణంలో అలకరించిన పెద్ద బగ్గీలో మౌలాలీ చాంద్ నిషానీ రూపంలో భక్తులకు దర్శనమిస్తూ నాగుల్‌మీరా దర్గా వరకు ప్రయాణం సాగింది.

ఆకట్టుకున్న సంగీత వాయిద్యాలు

ఏటా నాగుల్ మీరా జులూస్‌లో కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. దీనికి ముందు భాగంలో నాగ్‌పూర్ నుంచి వచ్చిన ఖవ్వాలి కళాకారులు మధురమైన భక్తి గీతాలు ఆలపిస్తుండగా.. వారికి అనుగుణంగా ప్రత్యేక వాహనంలో కళాకారుల సంగీత వాయిద్యం ఆకట్టుకుంది. ఆ వెనుకాల గోదావరి జిల్లాల నుంచి వచ్చిన సింగిరి మేళం డప్పు వాయిద్యాలు, ఆ వెనుకాల తంబోలా కళాకారులు డ్రమ్ వాయిస్తుండగా, ఆ వెంటనే హైదరాబాద్ మర్ఫాలు ప్రత్యేక వాయిద్యాలతో జులూస్‌లో సందడి చేశారు. చివరలో నాగుల్‌మీరా భక్తులుగా ఆయన సేవలో తరిస్తున్న సత్యనారాయణపురం గ్రామ బ్యాండ్ మేళం ట్రూప్ సంప్రదాయ డప్పు చప్పుళ్లతో జులూస్‌లో జోష్ పుట్టించారు. శబ్దరీతులకు తగ్గట్టుగా యువత నృత్యాలు చేయగా, అయ్యప్ప మాలధారులు నాగుల్‌మీరాకు సమర్పించేందుకు కావడిలో నైవేద్యం సిద్ధం చేసుకొని భుజంపై మోస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన అశ్వాలు సైతం ఆకట్టుకునే రీతిలో ప్రదర్శనలు చేస్తూ సందడి చేశాయి.

ఏడు గంటల పాటు ఊరేగింపు

పట్టణంలోని ఖాసీం దుల్హా దర్గా నుంచి నాగుల్ మీరా దర్గా వరకు ప్రతీ కూడలిలో అరగంట పాటు భాజాలతో హోరెత్తిపోయింది. భారీ సంఖ్యలో పాల్గొనడంతో పాటు రహదారికి ఇరువైపులా జనం బారులు తీరి నాగుల్‌మీరాకు ఎదురేగి ఆశీర్వాదం తీసుకోవడంతో జులూస్ ఆలస్యంగా ముందుకు సాగింది. సుమారు ఏడు గంటలకుపైగా కొనసాగగా.. హజరత్ నాగుల్‌మీరా దర్గాహ్‌లో మాలిక్ లక్ష్మీనారాయణ ఎదురెళ్లి భక్తుల కోలాహలం నడుమ ఘనంగా ఆహ్వానించారు.

అడుగుడుగునా నీరాజనం

పట్టణంలోని హజరత్ ఖాసీందుల్హా దర్గాహ్ షరీఫ్ నుంచి ఉదయం 11 గంటలకు జులూస్ ప్రారంభమైంది. తొలుత ఖాసీం దుల్హా దర్గాహ్, పీరీల కొట్టంలో పూజలు చేసిన అనంతరం నంబర్ టూ బస్తీ, పాత బస్టాండ్, జగదాంబసెంటర్, ఆంబజార్, బుగ్గవాగు, కొత్త బస్టాండ్, గోవింద్ సెంటర్, సత్యనారాయణపురం మీదుగా అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ చిల్లా వరకు సాగింది. నాగుల్‌మీరా నిషానీలతో పాటు గంధంతో ప్రత్యేక రథం వెంటరాగా తెల్లటి దుస్తులు ధరించిన భక్తులు పాదయాత్ర ద్వారా ముందుకు సాగారు. భక్తులు అడుగడుగునా బగ్గీల ముందు నీళ్లారబోసి, కొబ్బరికాయలు కొట్టి నాగుల్ మీరా ఆశీర్వాదం పొందారు. ఈక్రమంలోనే తెల్లటి దుస్తులు ధరించిన భక్తులు ప్రజలకు ఊదుపాగ పెడుతూ చందనం రాస్తూ నాగుల్ మీరా ఆశీర్వాదం అందించారు.


ఖాసీం దుల్హా దర్గాహ్‌లో పూజ చేస్తున్న భక్తులు


కావడిలో నైవేద్యంతో అయ్యప్ప మాలధారులు


ఆకట్టుకున్న తంబోలా డప్పు శబ్దం

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా..


2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్, వివిధ శాఖాధికారులు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న నేపథ్యాన డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సంబరాల సందర్భంగా మొదటి రోజు ఆదివారం కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ నుంచి రామచంద్ర డిగ్రీ కళాశాల వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన 2కే రన్‌లో కలెక్టర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, నాయకులు, విద్యార్థులు, వాకర్స్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు, యువకులు, విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకే ఈ 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరికి ఉదయం పూట నడక, రన్నింగ్ లాంటివి అవసరమని అన్నారు. ఆటలను బహుమతులు కోసం కాకుండా తాము ఎంతో ఇష్టంతో ఆడుకున్నామని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాగ సీతారాములు, వివిధ అసోసియేషన్ల సభ్యులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి..

- సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియా బెస్ట్
- నవంబర్‌లో లక్ష్యం 12.16 లక్షల టన్నులు
- ఉత్పత్తి 13.25 లక్షల టన్నులు


కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): నవంబర్ మాసంలో కంపెనీ నిర్దేశించిన 12.16 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 13.25 లక్షల టన్నుల ఉత్పత్తిని(110 శాతం) సాధించింది. గడచిన తొమ్మిది మాసాల్లో కంపెనీ నిర్దేశించిన వార్షిక లక్ష్యం 89.64 లక్షల టన్నులు కాగా 86.54 లక్షల టన్నులు సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. రోజు వారీ ఉత్పత్తిలో రోజుకు 48,673 వేల టన్నులకు గాను 48000 వేలు(99 శాతం) సాధిస్తుంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో గడచిన తొమ్మిది నెలల్లో 43.64 మిలియన్ టన్నుల లక్ష్యానికి 39.93 మిలియన్ టన్నుల్లో కొత్తగూడెం ఏరియా తన వంతుగా రెండు ఓపెన్ కాస్ట్ గనులు, ఒక భూగర్భగనిలో 86.54 లక్షల టన్నులు సాధించి పెద్దన్న పాత్ర పోషిస్తుంది.

వార్షిక లక్ష్యాన్ని సాధిస్తాం..



సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియాకు 145 లక్షల టన్నుల లక్ష్యాన్ని ఇచ్చింది. దానిలో గడచిన తొమ్మిది మాసాల్లో 86.54 లక్షల టన్నులు సాధించాం. కాగా, గడిచిన మూడు మాసాల్లో ఏరియాలో కురిసిన వర్షం కారణంగా కొంత వెనకబాటు ఉన్నా మిగిలిన నాలుగు మాసాల్లో 53.46 లక్షల టన్నులు సాధించడానికి నేటి నుంచి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వార్షిక లక్ష్యాన్ని కచ్చితంగా సాధిస్తాం. – శాలేంరాజు, ఏరియా జీఎం

క్లుప్తంగా

ముగిసిన కార్తీక పూజలు


గోదావరి తీరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

భద్రాచలంటౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో ఆదివారం కార్తీక మాసం చివరి రోజు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'కొత్తగూడెం'


విజేత జట్టు కొత్తగూడెం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి టోర్నీలో కొత్తగూడెం జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొనగా.. భద్రాచలం మహేష్ మెమోరియల్ జట్టు, కొత్తగూడెం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 1–0 తేడాతో కొత్తగూడెం జట్టు విజయం సాధించింది. విజేత, రన్నర్ జట్లకు ట్రోఫీని సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ సి.ప్రీతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కమాండెంట్ సాహు, డిప్యూటీ కమాండెంట్ సింగర్ వేల్, పట్టణ సీఐ సంజీవరావు, సూర్యనారాయణ, చలపతి, కోటేష్, నరేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

'రాసూరి'కి కార్మికరత్న జాతీయ అవార్డు


ఆహ్వానపత్రాన్ని అందుకుంటున్న రాసూరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సింగరేణి బ్రాంచ్ అధ్యక్షుడు, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్‌కు బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) ఆదివారం కార్మికరత్న అవార్డును ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని నాచారంలోఉన్న బీఎస్‌ఏ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఈ అవార్డును ఈనెల 15న న్యూఢిల్లీలో జరిగే బీఎస్‌ఏ ఐదో నేషనల్ కాన్ఫరెన్స్‌లో అందజేస్తామని ప్రకటించి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం ఉద్యమకారులు, సంఘ సేవకులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలు అందించే సేవలను ప్రోత్సహించేందుకు గాను ఈ అవార్డు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాసూరి మాట్లాడుతూ.. ఈ అవార్డు తనలో ఆత్మస్థైర్యాన్ని, బాధ్యతను పెంచిందని తద్వారా కార్మికులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ నాజర్‌పాషా, బీఎస్‌ఏ తెలంగాణ అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి నల్లా జ్యోతి పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేట: మండల పరిధిలోని దురదపాడు అడవుల్లో కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు పందెం పుంజులు, రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా, మండల పరిధి లోని నారాయణపురం కాలనీలోని ఓ కమ్యూనిటీ హాల్‌లో ఎనిమిది మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంలో ఓ కానిస్టేబుల్ ఆదివారం సాయంత్రం అక్కడకు వెళ్లాడు. ఆ గదికి ఒకే గుమ్మం ఉండడంతో పరారయ్యే క్రమంలో ఆ కానిస్టేబుల్‌ను జూదరులు తోసేయడంతో కింద పడినట్లు సమాచారం. దీంతో కోపోద్రిక్తుడైన కానిస్టేబుల్‌కు జూదరులతో తీవ్ర వాగ్వాదం జరిగి గ్రామపెద్దల జోక్యంతో విషయం సర్దుమణిగినట్లు సమాచారం. కాగా, ఈ ఘటనలో ఎవరిపైనా కేసు నమోదైనట్లు సమాచారం లేదు. కానిస్టేబుల్‌ను నెట్టేసిన జూదరులు గ్రామంలో యథేచ్ఛగా తిరుగుతుండడంతో స్థానికులు నివ్వెరపోతున్నారు. ఈ విషయంపై ఎస్సైను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు అందుబాటులో లేరు.

రాజీవ్‌నగర్ శివారులో..

ములకలపల్లి: కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని రాజీవ్‌నగర్ శివారులో కోడిపందేలు ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కోడి పుంజులు, రూ.2వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భద్రాద్రిలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే గెలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

చర్ల: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులతో భద్రాద్రి గడ్డపై మళ్లీ బీఆర్‌ఎస్ జెండానే ఎగురుతుందని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఆదివారం చర్లలోని ఓ ఫంక్షన్ హాల్లో పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన డాక్టర్ తెల్లం వెంకట్రావు నెల రోజుల వ్యవధిలోనే పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఆయన అనైతికతను నియోజకవర్గ ఓటర్లు తీవ్రంగా తప్పు పడుతూ మళ్లీ త్వరగా భద్రాచలం ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడి మధ్యంతర ఎన్నికలు రావాలని చూస్తున్నారని ఆయన అన్నారు. అదే విధంగా మరో రెండు నెలల్లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం రేగా కాంతారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఏ ఒక్క పథకాన్నీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. సమావేశానికి ముందు మండలంలోని తేగడలో గల తాలిపేరు హైలెవల్ వంతెన నుంచి చర్ల వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి, డివిజన్ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, సింధు తపస్వి, మండల కో కన్వీనర్ ఐనవోలు పవన్‌కుమార్‌తో పాటు సోయం రాజారావు, మంతెన సీతాపతిరాజు, చింతా నాగబాబు, జోగిరాజు, ఎస్‌డీ అజీజ్, కాకి అనీల్‌కుమార్, పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి టీటీ టోర్నీ


విజేతలకు బహుమతి అందజేస్తున్న డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. అనంతరం జిల్లా టేబుల్ టెన్నిస్ జట్టుకు ఎంపికైన వారి వివరాలను ప్రకటించారు. అండర్–11 బాలుర జట్టులో కె.హితేశ్ (తల్లాడ), యశ్వంత్ (ఖమ్మం), జి.గౌరవ (ఖమ్మం), దుర్గా మణికంఠ, నిఖిల్ (పాల్వంచ) ఎంపికయ్యారు. అండర్–11 బాలికల జట్టులో బాలసాని హారిక, బాలసాని తన్మయిశ్రీ (ఖమ్మం), రోజన, షైనీ (పాల్వంచ), నేహశ్రీ (ఖమ్మం), అండర్–15 బాలురలో ఎస్‌కె ఫజల్ (ఖమ్మం), హరి, ఈ.తరుణ్ తల్లాడ, ఎ.ఉజ్వల్ (ఖమ్మం), సోమశేఖర్ (అశ్వాపురం), పరిటాల జ్వలిత్ (ఖమ్మం), కేతన్, తేజ (అశ్వాపురం), రామ సాకేత్ (పాల్వంచ), అభినవ కృష్ణ(తల్లాడ), అండర్–15 బాలికల జట్టులో కె.స్పందన చంద్ర (ఖమ్మం), పి.లతిక (పాల్వంచ), పి.హర్షిత (నేలకొండపల్లి), డి.ఉజ్వల, తేజస్వి, అక్షయ, జెవేరియా (తల్లాడ), గాయత్రి (కూసుమంచి) ఎంపికయ్యారు. అండర్–17 బాలురలో పి.మోహిత్‌కృష్ణ, తమన్ తేజ (ఖమ్మం), స్థితప్రజ్ఞ, అఖిలేశ్ (ఖమ్మం), అండర్–17 బాలికల జట్టులో జి.సిరి(ఖమ్మం), వి.సుప్రియ (నేలకొండపల్లి), జి.చంద్రికరాణి, షర్మిలారాణి (టేకులపల్లి), పి.సౌమ్యశ్రీ (దానవాయిగూడెం), నవ్య, ఎన్.విద్యశ్రీ (నేలకొండపల్లి), కల్పకబిందు, శ్రావణి (ఖమ్మం) ఎంపికయ్యారు. అండర్–19 బాలికల జట్టుకు నిషు (టేకులపల్లి), స్నేహిత, కె.ప్రియా (టేకులపల్లి), డి.సంగీత (దానవాయిగూడెం), ఇందు (నేలకొండపల్లి), బాణోత్ అఖిల (ఖమ్మం) జిల్లా జట్టుకు ఎంపిక కావడమే కాకుండా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. విజేతలకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శి వీవీ సాంబమూర్తి బహుమతులు అందించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

డ్రైవర్ పరిస్థితి విషమం?


బోల్తాపడిన ట్రాక్టర్

సుజాతనగర్: ట్రాక్టర్‌ను గుర్తు తెలియని ఓ వాహనం ఢీకొట్టిన సంఘటన సుజాతనగర్‌లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే కోమటిపల్లి గ్రామం నుంచి నాయకులగూడెం గ్రామ పరిధిలోకి అక్రమంగా ట్రాక్టర్‌లో కొందరు మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో మట్టిని అన్‌లోడ్ చేసిన ట్రాక్టర్ మళ్లీ మట్టి కోసం ఖాళీగా వెళ్తోంది. ప్రధాన సెంటర్ నుంచి సుజాతనగర్ వైపుగా లోపలికి వెళ్తున్న క్రమంలో కొత్తగూడెం వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో సుజాతనగర్ మండలం రాంజీతండా గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భూక్యా వసంత్‌కుమార్ తలకు తీవ్రగాయం కావడంతో కొత్తగూడెం ఆపై ఖమ్మంకు తరలించారు. ఇదిలా ఉండగా ట్రాక్టర్‌ను ఢీకొట్టిన వాహనం జాడ తెలియరాలేదు. కాగా, అక్రమంగా మట్టి, ఇసుక తోలకాలు సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

'ఫుడ్ పాయిజన్ బీఆర్‌ఎస్ పనే..'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: విద్యా సంస్థలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు ఎన్నడూ లేని విధంగా చోటు చేసుకుంటున్నాయని, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సెక్రటరీగా చేసిన నాటి యంత్రాంగంతోనే బీఆర్‌ఎస్ నాయకులు ఇలాంటి ఫుడ్‌పాయిజన్లకు తెరలేపారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్య రంగానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ఇందిరమ్మ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నిరాధార ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ప్రజాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీలుగా, రూ.వంద కోట్లతో యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం బీఎస్‌ఎఫ్‌ఐ ట్రైనింగ్ కార్యక్రమం, విద్యా కమిషన్ ఏర్పాటు, యూనివర్సిటీల్లో వీసీల నియామకం, ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు, తెలంగాణ దర్శిని వంటి కార్యక్రమాలకు రూపకల్పన చేసిందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, శివ, నాయకులు కూచిపూడి బాబు, సామా శ్రీనివాస రెడ్డి, కోటేశ్వరరావు, గాండ్ల సురేశ్ ఉన్నారు.

ధాన్యం కాంటా తూకంలో మోసం

పాల్వంచరూరల్: ధాన్యం కాంటా తూకంలో దళారి వ్యాపారి పలువురి రైతులను మోసం చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి నారాయణరావుపేట గ్రామంలో శనివారం దళారి వ్యాపారి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశాడు. సిద్దారెడ్డి, గుంగుల లక్ష్మీనారాయణరెడ్డి, నారకట్ల దుర్గరావులకు చెందిన ధాన్యం తూకంలో అదనంగా కేజీన్నర ఎక్కువ ధాన్యాన్ని తూకం వేసి దగా చేసిన మోసం బయటపడింది. దీంతో రైతులు వ్యాపారిని నిలదీయడంతో కేజీన్నరకు రూ.19 చొప్పున చెల్లించడంతో రైతులు శాంతించారు. వ్యాపారి మోసం చేసిన విషయాన్ని సివిల్ సప్లయీస్ డీటీ శ్రీనివాసరావుకు రైతు వెంకటేశ్వరరెడ్డి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా.. డీటీ స్పందించకపోగా జరిగిన మోసానికి కలెక్టర్, తహసీల్దార్, మంత్రి ఏం చేస్తారని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సదరు రైతు తెలిపారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

కరకగూడెం: మేనమామను గాయపరిచిన మేనల్లుడిపై ఆదివారం కేసు నమోదైంది. కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ముంజాల వసంతరావు తన ఇంటి గోడలను ప్లాస్టింగ్ చేయిస్తుండగా పక్కనే ఉన్న అతడి మేనమామ సారా సాంబశివరావు ఇంటిపై సిమెంట్ పడడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వసంతరావు మేనమామపై సిమెంట్ వేసి, తలపై రాయితో కొట్టగా తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబీకులు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. సాంబశివరావు ఫిర్యాదు మేరకు వసంతరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడి చేసిన ముగ్గురిపై..

పాల్వంచరూరల్: ఇసుక ర్యాంప్ వద్ద ఒక వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాగారంకాలనీకి చెందిన బోడ చంటి ట్రాక్టర్‌తో కూలీలను తీసుకు రావడానికి రంగాపురం సమీపంలోని కిన్నెరసానివాగు వద్దకు శనివారం రాత్రి వెళ్లాడు. అక్కడ రంగాపురంకు చెందిన ఎల్.రఘురాం, బి.విజయేందర్, సుమన్‌లకు చంటికి మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ముగ్గురు కలిసి తనపై దాడి చేశారని చంటి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేష్ తెలిపారు.

మోదుగులగూడెంలో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ మోదుగులగూడెం గ్రామంలో ఆదివారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గొగ్గెల సాయి అనారోగ్యంతో వారం క్రితం కొత్తగూడెం ఆస్పత్రిలో చేరాడు. కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి సాయికి సేవలందిస్తూ కొత్తగూడెంలోనే ఉండిపోయారు. ఆదివారం తిరిగి ఇంటికి చేరుకొని లోపలికి వెళ్లి చూడగా.. బీరువా పగులగొట్టి కనిపించింది. అందులో ఉండాల్సిన మూడు తులాల బంగారం, అర తులం వెండి కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

50 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బెల్లం పానకం, డ్రమ్ములతో పోలీసులు

కరకగూడెం: మండల పరిధిలోని కలవలనాగారం గ్రామ అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం ఎస్సై రాజేందర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈనేపథ్యాన సారా తయారీకి వినియోగించేందుకు డ్రమ్ముల్లో నిల్వ చేసిన 50 లీటర్ల బెల్లం పానకం లభ్యం కాగా దాన్ని అక్కడే పారబోసినట్లు ఎస్సై చెప్పారు. కాగా, పోలీసుల తనిఖీల్లో పానకంతో పాటు గుడుంబా తయారీకి అవసరమయ్యే వంట పాత్రలు కూడా అక్కడ ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండా సారా తయారీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

చిత్రహింసలు పెట్టి చంపేశారు

- ములుగు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల నేతల ఆరోపణ


ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోలను ప్రదర్శిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): ములుగు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 12 నెలల కాలంలో 16 మంది ఎన్‌కౌంటర్ పేరుతో చనిపోయారని తెలిపారు. ములుగులో మావోయిస్టుల శవాలు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు లేవని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపినట్లు ఉన్నాయని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శవ పరీక్షలు చేసి, ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్, పీడీఎస్ నేత చంద్రమౌళి పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఒక గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధి దలేర్‌కు చెందిన కుమ్మేక్ కుంజమ్‌ను రెండు రోజుల క్రితం మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. అతని గొంతుకోసి హతమార్చి మృతదేహాన్ని చితక్ టిండోడీ సమీపంలోని ప్రధాన రహదారిపై పడవేశారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామంటూ మావోయిస్టు పార్టీ బైరంఘడ్ ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు.

దండకారణ్యం నుంచి సరిహద్దుకు?

ఇటీవలి కాలంలో ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం

మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దులోకి వచ్చే అవకాశం ఉందన్న ఎస్ఐబీ

- పలువురు ఎస్పీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాలతో డీజీపీ భేటీ
- ఆ తర్వాతే వాజేడులో ఇద్దరు ఇన్‌ఫార్మర్లను హత్య చేసిన మావోయిస్టులు
- తాజా ఎన్‌కౌంటర్‌తో ఎస్ఐబీ అంచనా నిజమని తేలిన వైనం
- రాష్ట్రంలో సంచరిస్తున్న 15 మందిలో 14 మంది మృతి!



సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/మంథని/ సాక్షి హైదరాబాద్: దండకారణ్యం నుంచి మావోయిస్టు సాయుధ దళాలు సేఫ్ జోన్‌గా భావిస్తున్న తెలంగాణ సరిహద్దుకు వచ్చాయా? ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు దండకారణ్యం వీడుతున్నారా? పారా మిలటరీ, యాంటీ మావోయిస్టు స్క్వాడ్స్, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు, తీవ్రమైన నిర్బంధం నేపథ్యంలో ఎత్తుగడలలో భాగంగా తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నారా? రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహించాలనుకున్నారా? అంటే నిజమేనంటున్నాయి పోలీసు వర్గాలు. దండకారణ్యం విడిచి తెలంగాణకు చేరుకుని కార్యకలాపాలు నిర్వహించే క్రమంలోనే కీలక మావోయిస్టునేతలు కురుసం మంగు అలియాస్ భద్రు, పాపన్న, ఏగోలపు మల్లయ్య అలియాస్ కరుణాకర్, కోటి, మధు సహా ఏడుగురు మావోయిస్టులు మృత్యువాత పడినట్లు చెబుతున్నారు. రెండు నెలలుగా పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో దండకారణ్యంలో యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర సాయిధ బలగాలు నారాయణపూర్ జిల్లా అబూజ్‌మఢ్ దండకారణ్యంలోకి చొచ్చుకు పోగా.. ఈ క్రమంలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో 254 మంది వరకు మృతి చెందినట్లు ఇటీవల మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

ముందే పసిగట్టిన ఎస్ఐబీ..

2026 నాటికి మావోయిస్టుల అంతమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో పోలీసు బలగాల చర్యలు అదేస్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వ్యూహం మార్చిన మావోయిస్టు అగ్రనేతలు, సాయధ దళాలు దండకారణ్యం నుంచి తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించే అవకాశం ఉందని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అంచనా వేసింది. రాష్ట్ర పోలీసులను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే ఈనెల 11న తెలంగాణ డీజీపీ జితేందర్.. జేఎస్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీలు, ఓఎస్‌డీలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బృందాల ఇన్‌చార్జిలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇది జరిగిన పది రోజులకు మావోయిస్టులు ములుగు జిల్లా వాజేడులో పంచాయతీ కార్యదర్శి ఉయికే రమేష్, ఉయికే అర్జున్‌లను ఇన్‌ఫార్మర్ల పేరిట హత్య చేశారు. అనంతరం రాష్ట్రంలో భారీ ఎన్‌కౌంటర్ సైతం చోటు చేసుకోవడంతో ఇంటెలిజెన్స్ వర్గాల అంచనా నిజమని తేలింది. మావోయిస్టు అగ్ర నాయకత్వంలో ఉన్న పలువురు తెలుగు రాష్ట్రాల నాయకుల్లో కొందరు ఆరోగ్య సమస్యలతో ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న దండకారణ్యంలోని ఒక్కో స్థావరాన్ని కేంద్ర పారా మిలటరీ బలగాలు స్వాధీనం చేసుకుంటుండటంతో కొత్త ప్రదేశాలకు మకాంమార్చే యోచనలో భాగంగా మావోయిస్టు దళాలు సరిహద్దుకు చేరాయని తెలుస్తోంది.

ఉనికి ఉన్నట్టుగా లేఖలు

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో దళాల సంచారం లేకున్నా వివిధ ఏరియా కమిటీల పేరిట తరచుగా లేఖలు విడుదల చేస్తూ వచ్చారు. సాధారణంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు - భద్రాద్రి కొత్తగూడెం (ఏఎస్ఆర్‌బీకే) డివిజన్ కమిటీల పేర్లతో లేఖలు వస్తుంటాయి. ఆ తర్వాత మంచిర్యాల - పెద్దపల్లి - భూపాలపల్లి-ములుగు జిల్లాల డివిజన్ పేరిట కూడా లేఖలు వచ్చేవి. కానీ 2023 రెండో అర్ధభాగం నుంచి 2024 తొలి అర్ధభాగం వరకు పాల్వంచ - మణుగూరు, ఇల్లెందు - నర్సంపేట, సింగరేణి, చర్ల - శబరి తదితర ఏరియా కమిటీల పేర్లతో లేఖలు రావడం ఎక్కువైంది. తద్వారా తెలంగాణలో తమ ఉనికి ఉన్నట్టుగా చాటుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు.

తుడిచిపెట్టుకుపోయిన లచ్చన్న, భద్రు దళాలు

వివిధ కమిటీల పేర్లతో లేఖల జారీల అనంతరం జూన్‌లో మావోయిస్టులు గోదావరి తీరం దాటి తెలంగాణలోకి వచ్చినట్టు గట్టిగా ప్రచారం జరిగింది. దీనికి తగ్గట్టుగానే ములుగు - భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో గుండాల మండలం దామెరతోగు అడవుల్లో జూలై 25న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. ఈ కాల్పులపై పోలీసులు స్పందిస్తూ.. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నతో పాటు దాదాపు 15 మంది మావోయిస్టులు ఆయుధాలతో సంచరిస్తున్నట్టు సమాచారం అందిందని, ఈ మేరకు చేపట్టిన కూంబింగ్.. ఎదురు కాల్పుల్లో ఒకరు చనిపోయారని ప్రకటించారు. కాగా భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలో సెప్టెంబర్ 5న జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాల్వంచ- మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్నతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. ఒక మావోయిస్టు తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. దీంతో ముందుగా పేర్కొన్న 15మందిలో మొత్తం ఏడుగురు చనిపోయినట్టయ్యింది. లచ్చన్న దళం తుడిచిపెట్టుకు పోయినా భద్రు ఆలియాస్ మంగు దళం జాడ పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే తాజాగా ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మరణించడంతో భద్రు దళం మొత్తం హతమైంది.

భారీ నష్టం..

తాజా జరిగిన భారీ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల రఘునాథపాలెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యులలో లచ్చన్న, లచ్చన్న సతీమణి తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్, కామ్రేడ్ దుర్గేశ్ మరణించిన విషయం తెలిసిందే. కాగా ములుగు ఎన్‌కౌంటర్‌లో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీతోపాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన యువ మావోయిస్టులు చనిపోవడం మావోయిస్టులకు తీరని నష్టమేనని అంటున్నారు. ఇటీవల దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు తొలితరం అగ్రనాయకుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న, అలియాస్ విజయ్, అలియాస్ శంకర్‌రావు హతమైన విషయం కూడా తెలిసిందే.

ములుగు అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి


కుర్సం మంగు


ముస్సాకి దేవల్


ముస్సాకి జమున

కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా వారు పారిపోగా ఘటన స్థలంలో రెండు ఏకే-47 రైఫిళ్లు, ఒక జీ-6, ఒక ఇన్సాస్, 303 రైఫిళ్లు, మందుగుండు సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు, నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, పాపన్న (35), దండకారణ్యం డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, కోటి, కమలాకర్ (43), ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), పార్టీ సభ్యులు జైసింగ్ (25), కిషోర్ (22), కామేష్ (23)గా పోలీసులు గుర్తించారు. ఏగోలపు మల్లయ్యది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్‌కౌంటర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే 2015 సెప్టెంబర్ 15న ములుగు జిల్లా వెంగళాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ వడ్డేపల్లికి చెందిన ఎంటెక్ విద్యార్థి తంగళ్లపెల్లి శ్రుతి అలియాస్ మహిత, వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెండ్యాలకు చెందిన మణికంటి విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మరణించారు. అప్పట్నుంచి సుమారు తొమ్మిదేళ్ల తర్వాత ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరగడం కలకలం రేపుతోంది. మావోయిస్టు పార్టీ సాయుధ విభాగం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఏర్పడి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండురోజుల క్రితమే పిలుపునిచ్చింది. ఈ మేరకు వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న సమయంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుని ఏకంగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కిన చెల్పాక

తాజా ఎన్‌కౌంటర్‌తో చెల్పాక పేరు 33 ఏళ్ల తర్వాత మళ్లీ వార్తలకెక్కింది. 1991 జూన్ 21న అప్పటి పీపుల్స్‌వార్, ఇప్పటి మావోయిస్టు పార్టీ నక్సలైట్లు భారీ మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఏటూరునాగారం సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కిషోర్‌కుమార్ సహా ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు మరణించారు. రాజీవ్‌గాంధీ మరణానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ రోజునే గ్రామ సమీపాన నక్సలైట్లు ఈ ఘటనకు పాల్పడ్డారు. చెల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్సుల్లో సిరా పోసి, పథకం ప్రకారం పోలీసులకు సమాచారం చేరవేసి రప్పించిన నక్సల్స్.. ఈ భారీ మందుపాతర పేల్చారు. అదే చెల్పాక సమీప అడవుల్లో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

కొనసాగుతున్న కూంబింగ్

భారీ ఎన్‌కౌంటర్ పల్లెల్లో కలకలం రేపింది. ఇన్‌ఫార్మర్ల పేరిట వాజేడులో ఇద్దరి హత్య, ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా పోలీసు బలగాల కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. పీఎల్‌జీఏ వారోత్సవాలను భగ్నం చేసేందుకు గొత్తికోయ గూడేలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు.

మృతుల వివరాలు.. లభ్యమైన ఆయుధాలు

1.కుర్సం మంగు: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చేరమంగి గ్రామం. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద లభ్యమైన ఆయుధం ఏకే-47.

2.ఏగోలపు మల్లయ్య: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం. తెలంగాణ, డివిజన్ కమిటీ సభ్యుడు, ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి. ఇతని వద్ద కూడా ఏకే-47 లభ్యమైంది.

3.ముస్సాకి దేవల్: గొత్తికోయ. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ గ్రామం. ఇతని వద్ద జీ3 రైఫిల్ లభ్యమైంది.

4.ముస్సాకి జమున: గొత్తికోయ. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బైరామ్‌ఘర్ గ్రామం.

5.జైసింగ్: పార్టీ సభ్యుడు. ఇంద్రావతి ప్రాంతం. లభ్యమైన ఆయుధం.303 రైఫిల్.

6.కిషోర్: పార్టీ సభ్యుడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరు పీఎస్ పరిధి పాంపాడ్ గ్రామం. లభ్యమైన ఆయుధం ఇన్సాస్ రైఫిల్.

7. కామేష్: పార్టీ సభ్యుడు. ఛతీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పీఎస్ పరిధి మలంపెంట గ్రామం. లభ్యమైన ఆయుధం ఎస్‌బీబీఎల్ గన్.

జిల్లా వార్తలు

సభ్యులు తిన్నాకే విద్యార్థులకు..

- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలులో నిబంధనలు
- నాణ్యత పరిశీలన, తనిఖీలకు ప్రత్యేక కమిటీలు
- అన్ని పాఠశాలల్లో నియమించాలని విద్యాశాఖ ఆదేశం
- నాసిరకం భోజనానికి చెక్ పెట్టేలా చర్యలు


సింగారెడ్డిపాలెంలో వంటలను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల భోజన లోపాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన ఎక్కడా సమస్య రాకుండా, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార కమిటీలను నియమించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ కమిటీల్లో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రతిరోజూ వారు భోజనం చేశాక విద్యార్థులకు వడ్డించాలనే నిబంధన విధించారు. తద్వారా భోజనంలో నాణ్యత పెరుగుతుందని.. లోపాలు ఉంటే సరిదిద్దే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

నాణ్యత లేకుంటే వెనక్కి..

ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో హెచ్ఎం, ఉపాధ్యాయులతో కలిపి ముగ్గురితో కూడిన ఆహార కమిటీల నియామకం చివరి దశకు చేరింది. వీరు మధ్యాహ్న భోజనానికి వినియోగించే సరుకుల పరిశీలనలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. బియ్యం సహా ఏ సామగ్రి అయినా సరే ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా తీసుకురాకుండా పర్యవేక్షించాలి. సరుకుల్లో నాణ్యత ఉంటేనే అనుమతించాలని, లేకపోతే తిప్పి పంపాలని స్పష్టమైన ఆదేశాలు అందాయి. అంతేకాక మధ్యాహ్న భోజనం తయారీకి వాడుతున్న బియ్యంతో పాటు కారం, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు, నూనె ఇలా ప్రతీది నాణ్యతగా ఉందా, లేదా అని కూడా పరిశీలించాలి. ఆపై వంట చేసే ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కాగా, ప్రతి రోజూ వంట చేసే సమయంలో ఫొటోలు తీసి విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆపై కమిటీ సభ్యులు భోజనం చేసి అంతా బాగుందని నిర్ధారించుకున్నాకే విద్యార్థులకు వడ్డించాలి. ఈ కమిటీలను ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలో వెంటనే ఏర్పాటుచేయాలని అధికారులు సూచించారు. ఈ కమిటీతో పాటు మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సైతం నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ప్రతీ బుధవారం విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కమిటీల బాధ్యతలివే..

- ప్రతీరోజు వంట గదుల్లో పరిశీలించాలి. నాణ్యమైన కూరగాయాలు వస్తున్నాయా, లేదా అని తనిఖీ చేయాలి.
- వంటకు ఉపయోగించే ఇతర దినుసులు కూడా నాణ్యమైనవేనా.. ఉపయోగానికి గడువు ఉందా అని పరిశీలించాలి.
- ఉపాధ్యాయులు తిన్న తర్వాతే విద్యార్థులకు భోజనం వడ్డించాలి.
- టీచర్లు భోజనం చేశాక రుచిపై అభిప్రాయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- రుచి బాగుందా, లేదా అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలు తీసుకుని రిజిస్టర్‌లో సంతకాలు చేయించాలి.
- వంటలను పాఠశాలలోనే చేయించాలి. ఏజెన్సీ బాధ్యులు ఇంటి వద్ద వండుకుని తీసుకొస్తే నిరాకరించాలి.
- ఏజెన్సీ నిర్వాహకులు శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలోని వంట గదిలో, కార్యాలయంలో మెనూ చార్ట్ ఏర్పాటు చేయాలి.
- ఆహార కమిటీ బాధ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు సైతం చార్ట్‌లో నమోదు చేయాలి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. కమిటీ సభ్యులు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలి. ఈ నిబంధనల అమలును తరచుగా పర్యవేక్షిస్తాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

అన్ని పాఠశాలల్లో కమిటీలు



విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలల్లో ఆహార కమిటీలు ఏర్పాటు చేశాం. వంట గది, ఆఫీస్ రూమ్‌లో మెనూ, కమిటీ వివరాలతో చార్ట్‌లు ఉంటాయి.

– బి.చలపతిరావు, ఎంఈఓ, నేలకొండపల్లి

విద్యార్థులకు మేలు జరుగుతుంది..



ప్రభుత్వ పాఠశాలలో ఆహార కమిటీలను ఏర్పాటుచేయడం మంచి నిర్ణయం. ఉపాధ్యాయులు తిన్నాకే విద్యార్థులకు వడ్డిస్తే లోపాలు తెలిసిపోతాయి. విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా ఉంటుంది.

– జి.మస్తాన్, విద్యార్థి సంఘం నాయకులు, నేలకొండపల్లి

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.31,135

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పై నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో గడిపారు. 475 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.16,875, 300 మంది బోట్ షికారు చేయడంతో పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.14,260 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.


జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

సొంత అవసరాలకు అంబులెన్స్‌లు

- సింగరేణి మణుగూరు ఏరియాలో కరువైన పర్యవేక్షణ
- బ్రేక్‌డౌన్ సమయాన సైతం బిల్లులు?



మణుగూరు ఏరియా ఆస్పత్రి

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని అంబులెన్స్‌లను కొందరు సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. కార్మికులు ఆపదలో ఉన్న సమయాన వాడాల్సిన అంబులెన్స్‌లు కొందరు చిన్న చిన్న, వ్యక్తిగత పనులకు వాడుతున్నట్లు సమాచారం. వాహనాల నిర్వహణపై పర్యవేక్షణ కరువవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. చిన్న చిన్న పార్సిళ్లే కాక రెస్టారెంట్ల నుంచి బిర్యానీలు తీసుకురావడానికి, వ్యక్తిగత పనులకు 10 నుంచి 25 కిలో మీటర్ల మేర అంబులెన్స్‌లను పంపిస్తూ సొంత వాహనాలుగా వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక ఇటీవల మణుగూరులో జరిగిన ఓ వేడుకకు సామగ్రిని సైతం అంబులెన్స్‌ల్లోనే తరలించినట్లు సమాచారం.

పర్యవేక్షణ లోపించడంతో..

మణుగూరు ఏరియాకు మొత్తం ఏడు అంబులెన్స్‌లు ఉండగా మూడు మైన్లపై, మరో మూడు ఏరియా ఆస్పత్రికి కేటాయించారు. ఇంకో వాహనం మార్చురీ వాహనంగా ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచారు. ఇందులో ఏసీ సౌకర్యం కలిగిన ఓ వాహనంలో ఏసీ పనిచేయక ఐదు నెలలు దాటిందని సమాచారం. అయినప్పటికీ వాహనం తిరుగుతోందని బిల్లులు పెడుతున్నట్లు తెలిసింది. అలాగే, ఓ అంబులెన్స్ బ్రేక్‌డౌన్‌తో 15 రోజులు నిలిచిపోయి ఆ తర్వాత అందుబాటులోకి వచ్చింది. అయితే, మరమ్మతు కోసం పక్కన పెట్టిన సమయంలోనూ తిరిగినట్లు బిల్లులు చేయిస్తున్నారని సమాచారం. ఇదంతా పర్యవేక్షించాల్సిన అధికారి ఒకరు కొత్తగూడెంలో ఓ వేడుకకు అంబులెన్స్‌లో వెళ్తూ కంపెనీ పనిపై వెళ్లినట్లు రికార్డుల్లో పొందుపర్చినట్లు తెలిసింది. కార్మికులకు అత్యవసర సమయాల్లో సేవలందించాల్సిన వాహనాలను దుర్వినియోగం చేస్తున్న నేపథ్యాన ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీవైసీఎంఓ మేరీకుమారిని వివరణ కోరగా... తాను సెలవులో ఉండగా, ఇన్‌చార్జిగా ఓ డాక్టర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. అయినా తాను అంబులెన్స్‌ల వ్యవహారాన్ని పెద్దగా పట్టించుకోనని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పడం గమనార్హం. దీనిపై ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌ను వివరణ కోరగా.. అంబులెన్స్‌లు తరచూ నిలిచిపోవడం, సొంత వాడకాలకు వినియోగించడాన్ని ఉపేక్షించబోమని చెప్పారు. అంబులెన్స్‌లను జీఎం ఆఫీస్‌కు, మెడిసిన్ తీసుకురావడానికి మాత్రమే వినియోగిస్తారని, మిగతా సందర్భాల్లో కార్మికుల సేవల కోసమే అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అంబులెన్స్‌లు ఎప్పుడూ ఫిట్‌గా ఉండాలని, లేదంటే టెండర్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

రూ.100 పార్సిల్‌కు రూ.400 డీజిల్

ఏరియా ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి మందులు, ఇతర సామగ్రి వస్తుంటాయి. ఇల్లెందు, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి మణుగూరు ఆస్పత్రికి వచ్చే చిన్నచిన్న పార్సిళ్లు తీసుకురావడానికి కూడా ఖాళీగా ఉంటుందనే నెపంతో అంబులెన్స్‌లు వాడుతున్నారని తెలుస్తోంది. ఈ కారణంగా రూ.100 కూడా విలువ చేయని పార్సిళ్లు తీసుకొచ్చి రూ.400 డీజిల్ వాడినట్లు బిల్లులు సమర్పిస్తున్నారని సమాచారం. అంతేకాకుండా బిర్యానీ, కర్రీలు తీసుకురావడానికి హోటళ్లకు, డాక్టర్ల నివాసాల్లో ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రి పాడైతే మరమ్మతులకు చేయించడానికి అంబులెన్స్‌ల్లోనే పంపిస్తున్నారని సమాచారం.

పనిముట్లు లేకుండానే పనులు..

- సింగరేణిలో సివిల్ కాంట్రాక్టు కార్మికుల ఇక్కట్లు
- కాంట్రాక్టర్ల తీరును పట్టించుకోని అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో సివిక్ పనులు చేసే కాంట్రాక్ట్ కార్మికులకు పనిముట్ల కొరత ఏర్పడింది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో గతంలో పర్మనెంట్ కార్మికులు సివిక్ పనులు చేసేవారు. వీరికి అవసరమైన పనిముట్లు అయిన చీపురు, పారలు, కొడవళ్ల వంటివి కంపెనీనే సమకూర్చేది. అయితే, కార్మికుల వేతనాలు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందని వారిని తొలగించగా.. కాంట్రాక్ట్‌కు ఇచ్చారు. ఒప్పందం సమయంలోనే కార్మికులకు సామగ్రి కూడా కాంట్రాక్టరే సమకూర్చాలని నిబంధన విధించారు. కానీ పనిముట్లు ఇవ్వకుండా కాంట్రాక్టర్ పనులు చేయాలని ఒత్తిడి చేస్తుండగా.. కార్మికులు సొంతంగా తెచ్చుకోవడమో లేదంటే అద్దెకు తీసుకురావడమో చేయాల్సి వస్తోంది. రూ.కోట్ల విలువైన టెండర్లు పొందిన కాంట్రాక్టర్ కార్మికులకు పనిముట్లు ఇస్తున్నారా.. లేదా అని పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. ఇక కాలనీల్లో చెత్తా చెదారం తొలగించాక దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. ఈ నిబంధన కూడా ఒప్పందంలో ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే కార్మికులు మధ్యాహ్న భోజనం చేయడానికి కనీస వసతి కల్పించకపోగా తాగునీరు కూడా సమకూర్చడం లేదు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించుకోకపోగా.. కార్మిక సంఘాల నాయకులు సైతం నోరెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనల కంటే ఎక్కువ మంది...

సింగరేణి సంస్థ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేయడానికి నిర్దిష్ట సంఖ్యలో కార్మికులను నియమించుకోవాలని టెండర్ ప్రక్రియ చేపడుతుంది. ఈమేరకు నిబంధనల ప్రకారం 30 మంది కార్మికులను నియమించుకోవాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు సింగరేణిలో ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసి అదనంగా నియమిస్తున్నారని సమాచారం. ఫలితంగా కొంతకాలంగా పనిచేస్తున్న కార్మికులకు నెలనెలా 26 మస్టర్లకు బదులు ఆరు నుంచి పది వరకు తగ్గుతున్నాయి. దీంతో వారు వేతనం కోల్పోవాల్సి వస్తోంది. ఈ విషయం కూడా ఏరియా ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారని సమాచారం. అలా కాకుండా ఇకనైనా రొటేషన్ విధానానికి స్వస్తి పలికి.. తమకు 26 మస్టర్లు కేటాయించడంతో పాటు పనిముట్లు సరఫరా చేయాలని కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు.


కొత్తగూడెం ఏరియాలో కార్మికుల హాజరు నమోదు చేస్తున్న సూపర్‌వైజర్